సాక్షి
కుమురం భీం

శుక్రవారం । 27 । జనవరి । 2023



నాగోబాకు పోటెత్తిన భక్తజనం

నాగోబా జాతరకు గురువారం భక్తులు పోటెత్తారు. సెలవు రోజు కావడంతో తెలంగాణ, మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. 8లో▸



బంక్‌లో ఇంధనం నిల్

ఐటీడీఏ, జీసీసీ పెట్రోల్ బంకుల్లో తరచూ నో స్టాక్ బోర్డులే దర్శనమిస్తున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజలు ఇంధనం కోసం ఇబ్బంది పడుతున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.2 / 15.4

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. వేకువజామున మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

టెండర్ల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని స్పెషల్ సబ్ జైలులో ఆహార వస్తువులైన కూరగాయలు, కోడిగుడ్లు, మటన్, చికెన్, సరఫరా చేసేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా జైలు అధికారి అశోక్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఫిబ్రవరి 3లోగా ఆదిలాబాద్ సబ్ జైలు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టెండర్ పొందిన వారు 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి 31 వరకు వస్తువులు సరఫరా చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9494632381 సంప్రదించాలని సూచించారు.

దుర్గామాతను దర్శించుకున్న జడ్జి



జడ్జిని సన్మానిస్తున్న గ్రామస్తులు

ఆసిఫాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ మండలం బాబాపూర్‌లోని దుర్గామాతను గురువారం జిల్లా జడ్జి ఉమామహేశ్వరి దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు సర్పంచ్ లక్ష్మి ఆధ్వర్యంలో స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇందులాల్, రాంలాల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు



ఆలయంలో భక్తుల సందడి

ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలోని షిర్డీ సాయి మందిరం 23వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఇందారపు మధుకర శర్మ, సాయిశర్మ ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, సాయినాథుడికి అభిషేకం నిర్వహించారు. వసంత పంచమి, వార్షికోత్సవం పురస్కరించుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పెద్దఎత్తున ఆలయాన్ని సందర్శించారు. మధ్యాహ్న హారతికి భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది. ఆసిఫాబాద్, వాంకిడి, రెబ్బెన, తిర్యాణి మండలాలతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. అర్చకులను శాలువలు, పూలదండలతో సన్మానించారు. సాయంత్రం పల్లకిసేవ, సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు తాటిపెల్లి రమేశ్, సాంగ్డే దామోదర్, రావుల దిలీప్, నాందేవ్, మనోహర్, పిన్న వివేక్, వెంకటేశ్వర్లు, రావుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినికి సన్మానం



అర్చనను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

దహెగాం(సిర్పూర్): దహెగాం మండల కేంద్రంలోని కేజీబీవీకి చెందిన పదోతరగతి విద్యార్థి గేడం అర్చన వ్యర్థ పదార్థాలతో ఇటుకల తయారీ విధానాన్ని ఆవిష్కరించి ఇటీవల విలేజ్ ఇన్నోవేషన్ అవార్డ్స్- 2023కు ఎంపికైంది. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సులోచన, సర్పంచ్ పుప్పాల లక్ష్మి విద్యార్థిని శాలువతో సన్మానించారు. విలేజ్ ఇన్నోవేషన్ అవార్డ్స్‌కు ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్ గూడ్, జెడ్పీటీసీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

వేడుకలు విజయవంతం చేయాలి

తిర్యాణి: ఆదివాసీల అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన ప్రొఫెసర్ మైఖేల్ యర్క్ జన్మదిన వేడుకలు విజయవంతం చేయాలని నిర్వాహకులు మోతీరాం, ఆదివాసీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమానికి ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లాలోని ఆదివాసీలు పెద్ద ఎత్తున తరలివచ్చి వేడుకలను విజయవంతం చేయాలని వారు కోరారు.



వేడుకలకు హాజరైన జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు

సమష్టి కృషితో జిల్లా అభివృద్ధి



జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- మహనీయులు అందించిన త్యాగ ఫలమే రాజ్యాంగం
- కలెక్టర్ రాహుల్‌రాజ్
- జిల్లా కేంద్రంలో సాదాసీదాగా గణతంత్ర వేడుకలు

ఆసిఫాబాద్: సమష్టి కృషితో జిల్లా అభివృద్ధికి పాటుపడాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో గురువారం 74 గణతంత్ర దినోత్సవం సాదాసీదాగా నిర్వహించారు. అదనపు కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, రాజేశం, ఎస్పీ సురేశ్‌కుమార్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు తదితరులు వేడుకలకు హాజరయ్యారు. కలెక్టర్, ఎస్పీ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కలెక్టర్ జాతీయ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. బ్రిటిష్ వారిని ఎదిరించిన ఎందరో త్యాగధనుల కృషి, ప్రాణత్యాగం ఫలితంగా స్వాతంత్ర్యం సాధించుకున్నామన్నారు. రాజ్యాంగాన్ని రూపొందించుకొని ప్రస్తుత స్వేచ్ఛను అనుభవిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ హక్కులను పొందడంతోపాటు తమ విధులు, బాధ్యతలను తెలుసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. రాజ్యాంగంలో పొందుపర్చిన అంశాల ఆధారంగానే ప్రత్యేక తెలంగాణ ఏర్పడిందని చెప్పారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అన్నిరంగాల్లో ముందుకెళ్తుందన్నారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

జిల్లాలోని చారిత్రాత్మక స్థలాలు, జిల్లా నైసర్గిక స్వరూపంపై కలెక్టర్ రచించిన పాటను సెయింట్ మేరీ విద్యార్థులు నృత్యంతో ప్రదర్శించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల యోగాసనాలు, గిరిజన గురుకుల బాలికల పాఠశాల విద్యార్థుల గ్రామీణ ప్రాంతాల వ్యవసాయం, కుల వృత్తులపై నృత్య ప్రదర్శన, గిరిజన కళాకారుడు తిరుపతి మురళీగానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వెదురుతో తయారు చేసిన కళాకృతులు, వస్తువుల స్టాల్స్ ప్రదర్శించారు. సామాజిక కార్యక్రమాల్లో విశిష్ట సేవలందించిన వారితోపాటు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అదనపు ఎస్పీలు అచ్చేశ్వర్‌రావు, భీమ్‌రావు, డీఎస్పీలు కరుణాకర్, శ్రీనివాస్, జెడ్పీటీసీలు అరిగెల నాగేశ్వర్‌రావు, సంతోష్, ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు, ఏఎంసీ చైర్మన్ మల్లేశ్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.







త్యాగధనుల కృషి ఫలితమే..

- ఎస్పీ సురేశ్‌కుమార్
- పోలీసులకు అవార్డులు ప్రదానం



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్, పోలీసు అధికారులు

ఆసిఫాబాద్: ఎందరో త్యాగధనుల కృషి ఫలితంగానే నేడు గణతంత్ర దినోత్సవం జరుపుకుంటున్నామని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించి దేశానికి దిశానిర్దేశం చేశారన్నారు. ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గుస్సాడీ కళాకారుడు కనకరాజును శాలువతో సన్మానించారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతమైన జిల్లాలో ఉత్తమంగా విధులు నిర్వర్తించి డీజీపీతో ప్రశంసలు పొందిన అధికారులకు ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేశారు. వీరిలో అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావు, కాగజ్‌నగర్ రూరల్ సీఐ కె.నాగరాజు, జైనూర్ సీఐ రామకృష్ణ, ఆసిఫాబాద్ సీఐ రాణాప్రతాప్, జైనూర్ ఎస్సై మధుకర్, దహెగాం ఎస్సై సనత్, చింతలమానెపల్లి ఎస్సై విజయ్, తిర్యాణి ఎస్సై రమేశ్, ఆర్ఎస్సైలు ఓదెలు, రాజశేఖర్ ఉన్నారు.

జిల్లా స్థాయిలో 77 మందికి..

జిల్లా స్థాయిలో అదనపు ఎస్పీ భీమ్‌రావు, రెబ్బెన సీఐ నరేందర్, టాస్క్‌ఫోర్స్ సీఐ సుధాకర్, ఆర్ఐ అడ్మిన్ భరత్ భూషన్, బెజ్జూర్ ఎస్సై వెంకటేశ్, ఆసిఫాబాద్ ఎస్సై గంగన్న, కెరమెరి ఎస్సై వెంకటేశ్, టాస్క్‌ఫోర్స్ ఎస్సై సందీప్, ఐటీ కోర్ ఎస్సై ప్రవీణ్, ఆర్ఎస్సై రాజేశ్‌తో పాటు 77 మందికి ఉత్తమ అవార్డులు అందజేశారు.

సరిహద్దులో మహా అభివృద్ధి



మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బీటీ రోడ్డు



జంగుబాయి ఆలయానికి వెళ్లేదారిలో వంతెన


- రెండు పంచాయతీల్లో మూడు రోడ్లు, వంతెన నిర్మాణం
- రహదారుల అభివృద్ధికి ముందుకొస్తున్న మహారాష్ట్ర ప్రభుత్వం
- సరిహద్దు గ్రామాల్లో రాకపోకలకు తప్పిన ఇబ్బందులు

కెరమెరి(ఆసిఫాబాద్): జిల్లా సరిహద్దులోని పలు వివాదాస్పద గ్రామాల్లో నేటికీ తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాల పాలన కొనసాగుతోంది. కెరమెరి మండలంలోని అనేక గ్రామాలు సరిహద్దున ఉండటంతో ఇక్కడ రెండు ప్రభుత్వాలు అభివృద్ధి పనులు చేపడుతున్నాయి. ఇక్కడి ప్రజలకు రెండుచోట్ల గుర్తింపు కార్డులు ఉన్నందున రెండు రాష్ట్రాల్లో జరిగే ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకుంటారు. అయితే ఇటీవల మహారాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ఇరు ప్రాంతాల మధ్య రాకపోకలను సులభతరం చేసేందుకు వీలుగా పలుచోట్ల రహదారుల నిర్మాణం చేపడుతోంది.

రూ.46 కోట్లు వెచ్చించి..

కెరమెరి మండలంలోని పరందోళి, ముకదంగూడ పంచాయతీలు తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో ఉన్నాయి. ఆయా గ్రామాల పరిధిలో మూడు రోడ్లు, ఒక వంతెన నిర్మాణం ఇటీవల పూర్తికావడంతో స్థానికుల ప్రయాణ కష్టాలు తీరాయి. ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన కింద గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి మహారాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపించింది. ఇందులో భాగంగా తాండ నుంచి పరందోళి వరకు రోడ్డు నిర్మాణానికి రూ.8కోట్లు, జివిత నుంచి పరందోళికి రూ.30 కోట్లు, శంకర్‌లొద్ది నుంచి పరందోళికి రూ.4.4 కోట్లు వెచ్చించి రోడ్లు నిర్మించారు. అలాగే ఆదివాసీలు ఆరాధ్య దైవం జంగుబాయి అమ్మవారి ఆలయానికి వెళ్లే దారిలో టొప్లకస వాగుపై రూ.4.58కోట్లతో వంతెన నిర్మించారు. రవాణా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో మహారాష్ట్రలోని పల్లెలకు రాకపోకలు సవ్యంగా సాగుతున్నాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా తెలంగాణ ప్రభుత్వం సైతం పలు గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించింది. మిగిలిన రోడ్లకు నిధుల మంజూరులో జాప్యం జరగడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి బీటీ రోడ్లకు రెండేళ్లలో పనులు, నిధులు మంజూరు కావడం, పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని స్థానికులు చెబుతున్నారు.


అటవీ అనుమతులు ఇవ్వాలి



మా గ్రామ పంచాయతీలో మహారాష్ట్ర ప్రభుత్వం రూ.46 కోట్లతో రోడ్లు నిర్మించింది. సరిహద్దుకు అవతల ఉన్న గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందులు తొలగాయి. పరందోళి రోడ్లు నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు మంజూరు చేయాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి.

– కాంబ్లె లక్ష్మణ్, మాజీ సర్పంచ్, పరందోళి

బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు



కెరమెరి మండలం ముకదంగూడంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.10లక్షల వరకు ఖర్చు చేసిన. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి బిల్లులు రాలే. ప్రజల శ్రేయస్సు కోసం రోడ్లు నిర్మించినా బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

– పతంగే లింబాదాస్, సర్పంచ్, ముకదంగూడ

సరస్వతీ నమస్తుభ్యం

- బాసరలో ఘనంగా వసంత పంచమి వేడుకలు
- అమ్మవారి జన్మదినం సందర్భంగా భారీగా తరలివచ్చిన భక్తులు
- తెల్లవారుజామునుంచే గోదావరిలో పుణ్యస్నానాలు
- అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో బారులు
- దర్శనానికి 4 గంటలు.. అక్షరాభ్యాసానికి 7 గంటల సమయం
- క్యూలైన్లలో నిరీక్షించలేక ఇబ్బంది పడిన చిన్నారులు, వృద్ధులు



క్యూలైన్‌లో దర్శనానికి నిరీక్షిస్తున్న భక్తులు



అక్షరాభ్యాసం చేయిస్తున్న పూజారులు

భైంసా/ముథోల్: చదువుల తల్లి సరస్వతీ క్షేత్రం బాసరలో వసంత పంచమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఏటా మాఘ శుద్ధ పంచమి రోజు అమ్మవారి జన్మదినం నిర్వహిస్తున్న సందర్భంగా అమ్మవారి దర్శనం కోసం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. బుధవారం రాత్రే సుమారు 50 వేల మంది భక్తులు బాసరకు చేరుకున్నారు. దీంతో ఆలయ అధికారులు గురువారం తెల్లవారుజామున 2 గంటల నుంచే అమ్మవారికి పూజలు ప్రారంభించారు. అర్చకులు అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు గర్భగుడిని పూలతో అలంకరించారు. భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు చేసి అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరారు. అమ్మవారి పూజల అనంతరం దర్శనానికి అనుమతించడంతో భక్తులు దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం తెలంగాణ ప్రభుత్వం తరఫున దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే గడ్డిగారి విఠల్‌రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకువచ్చారు. ఆలయ ఈవో విజయరామారావు, ఆలయ అధికారులు భాజాభజంత్రీలతో వారికి స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న మంత్రి, ఎమ్మెల్యేలు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు.

ఆలయ అభివృద్ధికి కృషి...

అమ్మవారి దర్శనం అనంతరం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి క్యూలైన్లలో నిల్చున్న భక్తులతో మాట్లాడారు. తర్వాత మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషిచేస్తామని తెలిపారు. వచ్చే వసంత పంచమి నాటికి మరిన్ని వసతి గృహాలు నిర్మిస్తామని తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులు ఇప్పటికే ప్రారంభించామని పేర్కొన్నారు.

రికార్డుస్థాయిలో అక్షరాభ్యాసాలు..

బాసర చరిత్రలో ఈ వసంతపంచమి రోజు రికార్డు స్థాయిలో అక్షరాభ్యాస పూజలు చేసినట్లు ఈవో విజయరామారావు తెలిపారు. కోవిడ్ కారణంగా రెండేళ్లుగా పిల్లలకు అక్షరాభ్యాస పూజలు వాయిదా వేసుకున్నవారు కూడా ఈ వసంత పంచమికి బాసరకు వచ్చారని తెలిపారు. దీంతో గురువారం ఒక్కరోజే 6,872 అక్షరాభ్యాస పూజలు జరిపించామని పేర్కొన్నారు. ఇందులో రూ.1000 అక్షరాభ్యాస పూజలు 4,046, రూ.150 అక్షరాభ్యాస పూజలు 2,826 జరిపించామని వివరించారు.

వసంత పంచమి రోజు అమ్మవారిని దర్శించుకోవడంతోపాటు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించాలని తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు బాసరకు తరలివచ్చారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నుంచి 8 భజన మండళ్ల సభ్యులు పాదయాత్రగా బాసర వచ్చారు. అమ్మవారిని స్మరిస్తూ భజనలు చేస్తూ ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. చుట్టుపక్కల పల్లెల నుంచి వేలాది మంది భక్తులు పాదయాత్రగా వచ్చి బాసర అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు మంత్రి, ఎమ్మెల్యే రావడంతో అధికారులు సుమారు గంటపాటు దర్శనాలు నిలిపివేశారు.

గంటల తరబడి నిరీక్షణ..

చిన్నారులకు అక్షరశ్రీకార పూజలు జరిపించేందుకు నానమ్మలు, అమ్మమ్మలు, తాతయ్యలు బాసరకు వచ్చారు. చిన్నారుల అక్షరాభ్యాస పూజలు చూసేందుకు వచ్చిన వృద్ధులంతా ఎనిమిది గంటలపాటు నిరీక్షించారు. భక్తులు క్యూలైన్లలో ఒకరినొకరు తోసుకోవడంతో చిన్నారులు ఒత్తిడి తట్టుకోలేక ఏడ్చారు. అక్షరాభ్యాస మండపాల్లోనూ గంటల తరబడి నిరీక్షించాల్సి రావడంతో చాలామంది పిల్లలు ఏడుస్తూ కనిపించారు. మంచిర్యాల జిల్లా వేంపల్లికి చెందిన చిన్నారి క్యూలైన్లలో కిందపడడంతో తలకు గాయమైంది. వెంటనే అంబులెన్స్‌లో బాసర సీహెచ్‌సీకి తరలించి వైద్యసేవలందించారు. అమ్మవారి దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టింది.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

బాసర సరస్వతీ అమ్మవారిని దర్శించుకునేందుకు పలువురు ప్రముఖులు బాసరకు చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఎమ్మెల్సీ దండె విఠల్, రాజ్యసభ సభ్యుడు దామోదర్‌రావు, ఈటల రాజేందర్ సతీమణి జమున, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బీజేపీ నాయకులు రామారావ్‌పటేల్ అమ్మవారిని దర్శించుకున్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి దంపతులు

క్లుప్తంగా

తెలంగాణ జట్టు హ్యాండ్ బాల్ కోచ్‌గా అరవింద్


అరవింద్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలో గిరిజన బాలికల పాఠశాలలో హ్యాండ్‌బాల్ కోచ్‌గా పనిచేస్తున్న అరవింద్ జాతీయ స్థాయి జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలకు రాష్ట్ర జట్టుకు కోచ్‌గా ఎంపికైనట్లు గురువారం ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అధ్యక్షుడు శ్యాం సుదర్‌రావు తెలిపారు. ఈ నెల 26 నుంచి 30 వ రకు తమిళనాడు రాష్ట్రంలోని తిరుచిరపల్లిలో జరిగే 44వ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కోచ్‌గా పనిచేస్తారని తెలిపారు.

ఉరేసుకుని రైతు ఆత్మహత్య

తిర్యాణి: ఉరేసుకుని రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని మాణిక్యపూర్ గ్రామంలో గురువారం వెలుగుచూసింది. ఎస్సై సీహెచ్ రమేష్ వివరాల ప్రకారం... మడావి లచ్చు(57) వ్యవసాయంతో పాటు పూజారిగా పనిచేస్తున్నాడు. కుటుంబ సభ్యులు లచ్చును పూజా కార్యక్రమాలకు వెళ్లవద్దని వారించారు. దీనికి తోడు అతడి వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ కాకపోడంతో మనస్తాపానికి గురై బుధవారం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టగా గురువారం పంట చేనులో ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. లచ్చు భార్య మోతుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సిర్పూర్(టి): పేకాటాడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. మండలంలోని భూపాలపట్నం గ్రామ శివారులో పేకాటాడుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ.2,100 నగదును స్వాధీనం చేసుకున్నారు.

మద్యంమైకంలో బావిలో దూకిన యువకుడు

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని కొత్తగూడెం కాలనీలోని బావిలో కోటపల్లి మండలం అర్జునగుట్ట గ్రామానికి చెందిన పడాల బాపు అనే యువకుడు తాగి న మైకంలో దూకాడు. గమనించిన కాలనీ వాసులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందజేశారు. సిబ్బంది చేరుకుని బావిలో దూకిన యువకుడిని తాళ్ల సహాయంతో బయటికి తీశారు. బావిలో నీళ్లు లేకపోవడంతో ప్రాణప్రాయం తప్పింది. గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు.

'బీఆర్‌ఎస్‌కు చరమ గీతం పాడండి'

జన్నారం: రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి, ప్రజలపై మోయలేని భారం మోపుతూ, అక్రమాలకు పాల్పడుతున్న బీఆర్‌ఎస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో చరమగీతం పాడాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పిలుపునిచ్చారు. గురువారం పీసీసీ పిలుపు మేరకు మండలంలోని రాంపూర్ గ్రామంలో హాత్ సే హాత్ జోడో యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖానాపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదని ఆరోపించారు. ప్రజల సమస్యలపై పట్టింపు లేకుండా ఉన్నారని తెలిపారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఫసీఉల్లా ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ పర్సనల్, బిజినెస్, ప్రాపర్టీ, ల్యాండ్స్ & వ్యవసాయ భూములపై మార్టిగేజ్ చేసుకొని అతి తక్కువ వడ్డీకి, వారం రోజులలో రుణం ఇవ్వబడును. ఏజెంట్స్ కావలెను. సంప్ర॥ 7836035286, 8901923173. [W-775802]

WANTED

■ డైరెక్ట్ జాబ్! Hyd లో 5స్టార్ హోటల్స్ లో క్యాటరింగ్ బాయ్స్ పరిశ్రమలలో ప్యాకింగ్ బాయ్స్ సాలరీ: 25-35వేలు, రూమ్+ మీల్స్ కలదు. ఫోన్ : 9542442263. [H-792786]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

ఉత్తమ సేవలకు గుర్తింపు


విద్యార్థుల యోగా బృందం


అచ్చేశ్వర్‌రావు, అదనపు ఎస్పీ


ఎండీ ఆరీఫ్, డీపీఎం


సాంస్కృతిక సారథి కళాకారులు


ఎండీ పాషాఖాన్, డీపీఆర్‌వో కార్యాలయ ఫొటోగ్రాఫర్


శివప్రసాద్, కేసీఆర్ కిట్ డీఈవో


పుష్పలత, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్


రాజేశ్వర్, కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్


ఉదయ్, స్త్రీనిధి మేనేజర్


శారద, బీసీ వెల్ఫేర్ శాఖ


బి.మధుకర్, జిల్లా మత్స్యశాఖ ఫీల్డ్ ఆఫీసర్


పద్మ, పశు సంవర్ధకశాఖ


సౌమ్య, ఎస్సై, కాగజ్‌నగర్‌రూరల్


వెంకటేశ్, స్పెషల్ పార్టీ, ఆసిఫాబాద్


ప్రకాశ్, స్పెషల్ పార్టీ, ఆసిఫాబాద్

ఆసిఫాబాద్‌అర్బన్: వివిధ శాఖల్లో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బందికి గుర్తింపు లభించింది. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ రాహుల్‌రాజ్ ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లాలో 31 ప్రభుత్వ విభాగాల్లో 70 మందికి ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. జిల్లా అధికారుల నుంచి జిల్లా ప్రణాళిక అధికారి రవీందర్ ఉత్తమ అధికారిగా అవార్డు అందుకోగా, పోలీసు విభాగంలో ఏఎస్పీ అచ్చేశ్వర్‌రావు, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, వాంకిడి సీఐ శ్రీనివాస్, మహిళా ఎస్సై సోనియా, ఏఎస్సైలు పోశెట్టి, గంగారాంనాయక్, హెడ్ కానిస్టేబుల్ నెహ్రూ, కానిస్టేబుళ్ల శేషురావు, వెంకటేశ్, ప్రకాశ్, మహేందర్, సతీశ్, తిరుమన్, రెవెన్యూ విభాగంలో తిర్యాణి తహసీల్దార్ అనంతరాజ్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రమేశ్, కలెక్టర్ ఓఎస్డీ రమేశ్, సిబ్బంది నవీన్‌కుమార్, రాజు ఉన్నారు. జిల్లా పరిషత్ నుంచి ఎంపీడీవో అబ్దుల్ నజ్రుల్‌ఖాన్, సీనియర్ అసిస్టెంట్ వసంత్, కార్యాలయ సిబ్బంది సాయి సుజాత, నవీన్‌కుమార్, ప్రణాళిక శాఖ నుంచి జయభాస్కర్, సిద్దార్థ, వ్యవసాయశాఖ నుంచి పాషాఖాన్, రవాణాశాఖ నుంచి ఎంవీఐ సంతోష్, గిరిజన సంక్షేమశాఖ నుంచి భీంకిరణ్, జిల్లా పంచాయతీ ఇంజనీరింగ్ విభాగం నుంచి ఏఈ మహ్మద్‌గౌస్ మొయినొద్దీన్ ఖాద్రి, శ్రీధర్, ఎస్సీ అభివృద్ధి శాఖ నుంచి చందన, మైనార్టీ శాఖ నుంచి పుష్పలత.

విద్యాశాఖ నుంచి భరత్, నందుకుడ, వైద్యశాఖ నుంచి డాక్టర్ వినయ్, స్టాఫ్‌నర్సు జ్ఞానేశ్వరి, సిబ్బంది శివ, పుష్పలత, స్వరూప, మత్స్యశాఖ నుంచి మధుకర్, సర్వే లాండ్ రికార్డ్స్ నుంచి అజీమొద్దీన్, విద్యుత్ శాఖ నుంచి సాయికిరణ్, చంద్రశేఖర్, బీసీ సంక్షేమశాఖ నుంచి శారద, పంచాయతీరాజ్ శాఖ నుంచి ప్రసాద్, ఆరీఫ్, రమేశ్, శివయ్య, గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి కృష్ణమూర్తి, శ్రీదేవి, రాజు, ఉదయ్‌కుమార్, లత, మహిళా శిశు సంక్షేమశాఖ నుంచి శేషగిరిరావు, సాయిదీపక్, తెలంగాణ సాంస్కృతిక సారథి సభ్యులు బాపు, తిరుపతి, సమ్మయ్య, మోహన్‌నాయక్, సోమశేఖర్, పురుషోత్తం, మారుతి, శిరీష, వెన్నెల, కృషి విజ్ఞాన కేంద్రం నుంచి రాజేశ్వర్‌నాయక్, శివకృష్ణ, బ్యాంకింగ్ రంగం నుంచి రాజేశ్వర్, సురేశ్, మిషన్ భగీరథ నుంచి మనోహర్, గ్రిడ్ నుంచి సాయికిరణ్, సామాజిక కార్యకర్త విభాగంలో దేవర వినోద్, గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ విభాగం నుంచి మహమ్మద్ నిజామొద్దీన్, పశుసంవర్ధక శాఖ నుంచి పద్మకు ప్రశంసాపత్రాలు అందించారు.

గిరిజనాభివృద్ధే ధ్యేయంగా ముందుకు


మాట్లాడుతున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి


ప్రశంస పత్రం అందిస్తున్న పీవో

ఉట్నూర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధీనంలోని గిరిజన ప్రాంతాల సంపూర్ణ అభివృద్ధికి ఐటీడీఏ ద్వారా కృషి చేస్తున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వరుణ్‌రెడ్డి అన్నారు. 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని గురువారం ఐటీడీఏ ప్రాంగణంలో జెండా ఎగురవేసి మాట్లాడారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యాభివృద్ధి లక్ష్యంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 917 గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో 12,945 మంది గిరిజన విద్యార్థులకు 681 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారని, అలాగే 133 గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 34,658 గిరిజన విద్యార్థులు పదో తరగతి వరకు చదువుకుంటున్నారని తెలిపారు. అలాగే ఐటీడీఏ పరిధిలోని 32 పీహెచ్‌సీలు, 186 ఉప ఆరోగ్యకేంద్రాలు, రెండు సామాజిక ఆరోగ్య కేంద్రాల ద్వారా గిరిజనులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు వివరించారు. వనబంధు కల్యాణ యోజనా ద్వారా ఏజెన్సీలోని కెరమెరి, వాంకిడి, తిర్యాణి మండలాల్లో వైద్య, వైద్య, వ్యవసాయం, విద్యుత్, మంచినీటి సరఫరా, ఇతర మౌలిక వసతులు కల్పన కోసం పది కోట్లు విడుదల కాగా ఇప్పటికి రూ. 7.50 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గిరిజన సహకార సంస్థ ద్వారా 17 పెట్రోల్ పంపులు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయగా ఆరు బంకులు ఏర్పాటు చేశామన్నారు. 97 మంది ఉత్తమ అధికారులకు, సిబ్బందికి ప్రశంస పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూఏసీ చైర్మన్ కనక లక్కెరావ్, ఐటీడీఏ ఏవో రాంబాబు, ఏపీవో జనరల్ కనక భీంరావ్, ఆర్డీవో సురేశ్, డీటీటీడబ్ల్యూ దిలీప్‌కుమార్, ఈఈటీడబ్ల్యూ భీంరావ్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, జీసీడీవో చాయా, ఆర్సీవో గంగాధర్, జేడీఎమ్ నాగాభుషణం, ఐసీడీఎస్ సీడీపీవో శ్రావణి పాల్గొన్నారు.

కొత్తగనుల ఏర్పాటుతో

ఏరియాకు పూర్వవైభవం


గౌరవ వందనం స్వీకరిస్తున్న జీఎం దేవేందర్


జాతీయ పతాకానికి వందనం చేస్తున్న సింగరేణి ఉద్యోగులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో చేపట్టబోయే కొత్త గనుల ఏర్పాటుతో ఏరియాకు పూర్వవైభవం తీసుకువస్తామని ఏరియా జీఎం దేవేందర్ అన్నారు. గోలేటిటౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో గురువారం గణతంత్ర్య దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. జీఎం కార్యాలయంతో పాటు సీఈఆర్ క్లబ్‌లలో జాతీయ జెండాలను ఎగురవేశారు. అనంతరం భీమన్న స్టేడియంలో వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. అనంతరం ఏరియాలో ఎంపికై న ఉత్తమ ఉద్యోగులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఏరియాకు త్వరలోనే పూర్వవైభవం రాబోతుందన్నారు. గోలేటి, మాదారం ఓసీపీల ఏర్పాటుతో ఉత్పత్తితో ఏరియాతో పరుగులు తీస్తుందన్నారు. ఏరియాలో ప్రస్తుతం ఒక్క ఓసీపీ మాత్రమే కొనసాగుతుండగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో గోలేటి ఓసీపీ ద్వారా ఉత్పత్తిని చేపట్టేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నామని అన్నారు. వేడుకల్లో భాగంగా పలువురు విద్యార్థులు జాతీయ నాయకుల వేషాధారణల్లో ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్‌వో టూ జీఎం గుప్తా, ఏజీఎం తిరుమల్‌రావు, పర్సనల్ మేనేజర్ లక్ష్మణ్‌రావు, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు రావు పాల్గొన్నారు.


పూలమాల వేస్తున్న జీఎం, ఏరియా ఉపాధ్యక్షుడు


ఉత్తమ ఉద్యోగులను సన్మానిస్తున్న జీఎం


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

గంజాయి తాగుతున్న ముగ్గురిపై కేసు


పట్టుకున్న గంజాయి

జన్నారం: మండల కేంద్రంలో గుట్టుగా గంజాయి సేవిస్తున్న వారిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం రాత్రి గంజాయి సేవిస్తూ విక్రయిస్తున్నారే సమాచారం మేరకు మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదురుగా గల అడవి ప్రాంతంలో దాడులు చేయగా, గంజాయితో ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారు. అదే విధంగా కొందరు అనుమానితులను పట్టుకుని వారి నుంచి రక్తం, మూత్రం శ్యాంపుల్ తీసుకుని పరీక్షల నిమిత్తం పంపించారు. పట్టుబడిన కామెర నగేశ్, పవన్, దుర్గం సాయిలపై కేసు నమోదు చేయగా, మిగతా వారి శ్యాంపుల్స్ పాజిటివ్‌గా తేలితే వారిపై కేసు నమోదు చేయనున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఇందులో దుర్గం సాయి అనే యువకుడు ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి తీసుకువస్తూ ఇక్కడ యువకులకు అమ్ముతున్నట్లు ఎస్సై తెలిపారు.

'వైద్యకళాశాల అందుబాటులో ఉండాలి'


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు

పాతమంచిర్యాల: ప్రభుత్వ వైద్యకళాశాల, జనరల్ ఆస్పత్రి ప్రజలకు అందుబాటులో ఉండే స్థలంలో నిర్మించాలని మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. గురువారం స్థానికంగా ఉన్న తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. సాయికుంటలోని ముంపు ప్రాంతంలో ఆస్పత్రి, మెడికల్ కళాశాల నిర్మాణం సరికాదని పేర్కొన్నారు. ఐబీఐ ఆవరణలో, గుడిపేటలో ప్రభుత్వ స్థలాలు ఉన్నా గోదావరి ముంపు ప్రాంతంలో నిర్మించాలనుకోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. గూడెం ఎత్తిపోతల పథకం ప్రజలకు ఉపయోగకరంగా లేదని, శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టు నుంచి 42వ డిస్ట్రిబ్యూటరీ వరకు నీరందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చీట్ల సత్యనారాయణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రావుల ఉప్పలయ్య, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ సంజీవ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానేష్ పాల్గొన్నారు.

పవర్‌ప్లాంటు కార్మికుల వినతి

పాతమంచిర్యాల: శాలివాహన గ్రీన్ ఎనర్జీ పవర్ ప్లాంట్ కార్మికులు మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. శాలివాహన గ్రీన్ ఎనర్జీ పవర్‌ప్లాంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్, ప్రధాన కార్యదర్శి నిమ్మరాజుల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఆనందరావు, కార్మికులు పాల్గొన్నారు.

నాగోబాకు పోటెత్తిన భక్తజనం







ఇంద్రవెల్లి: నాగోబా జాతరకు గురువారం భక్తులు పోటెత్తారు. సెలవు రోజు కావడంతో ఉమ్మడి జిల్లాతో పాటు తెలంగాణ, మహారాష్ట్రల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. గంటల తరబడి క్యూలో నిల్చోని నాగోబాను దర్శించుకున్నారు. నాగోబా జాతర పరిసర ప్రాంతాల భక్తులు ఎడ్ల బండ్లపై నాగోబా ఆలయానికి చేరుకున్నారు. నాగోబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు జాతరలో ఏర్పాటు చేసిన దుకాణ సముదాయల వద్ద ఇళ్లకు కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేశారు. ఈ నెల 28 వరకు అధికారికంగా నాగోబా జాతర కొనసాగనుంది.